# గోరంత దీపం

అనగా అనగా ఒక దీపం. ఒక యువ భారత చిరు జ్యోతి.

ఆ జ్యోతిని వెలిగించింది, లాండ్ ఆఫ్ ఆపర్చ్యూనిటీ అనబడే అమెరికా.

కానీ ఆ కాంతి వ్యాపించింది, ఇండియాలోనూ, అమెరికాలోనూ, మన ఇరుకు మనసుల ప్రపంచంలోనే కాదు. విశ్వమంతటా వ్యాపించింది. అంతరిక్షంలో నించి దూసుకుపోయి, ముల్లోకాలలోనూ వ్యాపించింది.

గోరంత దీపం. కొండంత వెలుగు.

* * *

ఆ రోజు జనవరి 28. 1986వ సంవత్సరం.

టెక్సాస్‌లోని శాన్ ఆంటోనియో అనే వూళ్ళో, నేను ఎంతో కష్టపడి తయారుచేసిన ప్లాటినమ్ రెసిస్టెన్స్ టెంపరేచర్ డివైజెస్‌ని ఫ్రీజింగ్ టెంపరేచర్ కన్నా తక్కువయిన ఛేంబర్‌లో టెస్ట్ చేస్తున్నాం. అప్పటిదాకా ఎవరి పని వాళ్ళు చేసుకుంటున్న టెస్టింగ్ లాబ్‌లో ఒక్కసారిగా హడావిడి మొదలయింది. అందరూ గబగబా కాఫెటేరియాలోకి పరుగెత్తుతున్నారు. నన్ను చూసిన మిత్రుడు టిమ్ "స్పేస్ షటిల్ టేకాఫ్ అవగానే పేలిపోయిందిట.. టీవీలో వస్తున్నది... పద.. " అని తనూ పరుగెత్తాడు.

లైవ్ టీవీలో చూసి నిర్ఘాంతపోయాను. స్పేస్ షటిల్ ఛాలెంజర్, ఆకాశం లోకి దూసుకుపోయిన కొద్ది క్షణాల్లోనే ముక్కలు ముక్కలయింది. ఆకాశం

అంతటా మంటలూ. పొగలూ. ఎంతో ఉత్సాహంతో, ఎన్నో సంవత్సరాల శిక్షణతో బయల్దేరిన ఆ ఏడుగురూ, అంతరిక్ష పరిశోధనకోసం ఆ అంతరిక్షానికి అంకితమయిపోయారు. క్రిష్టా మెక్కాలిఫ్ అనే స్కూల్ టీచర్ ఛాలెంజర్‌లో వెడుతున్నదని తెలిసి, చూడటానికి వచ్చిన ఎంతోమంది విద్యార్థులు, ముఖ్యంగా చిన్నపిల్లలు, ఏం జరుగుతున్నదో అర్థంకాక బిత్తరపోయారు.

నేనుకూడా ఇంతకుముందు స్పేస్ రీశెర్చిలో పనిచేసినవాడినే కనుక, ఆ దృశ్యం చూస్తున్నంతసేపూ అనిపిస్తూనే వుంది. మనిషి విజ్ఞాన శోధనలో నిత్య పారిశ్రామికుడు. (ఇక్కడ ఆడ మగా తేడా లేదు. అందరూ హీరోలే కనుక "డు" అని వాడుతున్నాను) ముందు తరాలవారి భవిష్యత్తు కోసం ప్రాణాలర్పించటానికి కూడా వెనుకాడని ఆ ధైర్యాన్నీ ఆ త్యాగాన్నీ చూస్తుంటే అదోవిధమైన భావంతో మనసు తేలిపోయింది. మనం ఈ రోజు అనుభవిస్తున్న సాంకేతిక విజ్ఞానం వెనుక అలాటి త్యాగాలు ఎన్నివున్నాయో ఒక్కసారి ఆలోచించి వాళ్ళకి నివాళి అర్పించటం మన బాధ్యత అనిపించింది.

ఆ సంఘటనతో కొంతమంది ఇలాటి స్పేస్ రీశెర్చి కార్యక్రమాలు వెనకపడతాయనీ పడాలనీ అన్నారు. అమెరికన్ గవర్నమెంటూ ఎంతోమంది ప్రజలూ శాస్త్రజ్ఞులూ అందరూ ముందుకు వెళ్ళటమే అవసరమని అభిప్రాయపడ్డారు. వెంటనే అంతరిక్ష పరిశోధన మళ్ళీ పుంజుకుంది. ఈ పదిహేడేళ్ళలోనూ, అంతరిక్ష సాంకేతికరంగంలో నాసా ఎన్నో ప్రయోగాలు చేసింది.

* * *

ఆకాశంలోకి చూసిన ప్రతి మనిషికీ, ప్రతిసారీ, అక్కడ ఏమున్నది అనే కుతూహలం రాక మానదు. వాళ్ళల్లో కొంతమంది ఆ విషయాల మీద రకరకాల పుస్తకాలు చదివి కావలసినంత సమాచారం సేకరిస్తారు. వాళ్ళల్లో కొంతమంది, కాలేజీల్లో ఎష్ట్రానమీ, ఏష్ట్రో ఫిజిక్స్, ఏరోనాటిక్స్‌లాటి కోర్సులు తీసుకుని, వాళ్ళ విజ్ఞానాభివృద్ధిని, వృత్తిరీత్యా సాగిస్తారు. వాళ్ళల్లో చాల కొద్దిమందికి అంతరిక్షంలోకి వెళ్ళాలనే కోరిక కూడా వుంటుంది. కానీ అలాటి వాళ్ళల్లో అలా అంతరిక్షంలోకి వెళ్ళే అవకాశం ఎంతమందికి వస్తుంది?

* * *

అలాటి కొద్దిమందిలోనూ ఒక చిన్న మనిషి కల్పన చౌలా.

ఢిల్లీ దగ్గరవున్న ఒక చిన్నవూరు, కర్నాల్‌లో పుట్టి పెరిగింది.

ఆమె కూడా ఆకాశంలోకి చూసింది. ఆమెకి కూడా అదే కుతూహలం కలిగింది. కావలసిన సమాచారమంతా సేకరించింది. అదిచాలక పంజాబ్ ఇంజనీరింగ్ కాలేజీలో 1982లో ఏరోనాటికల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ తీసుకుంది. తనకిష్టమైన ఆ రంగంలో అవకాశాల కోసం అవకాశాల దేశం అమెరికాకి వచ్చేసి, డల్లాస్ దగ్గరేవున్న ఆర్లింగ్‌టన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో 1984లో మాష్టర్స్ డిగ్రీ పూర్తిచేసింది. అక్కడినించీ కోలరాడో వెళ్ళి, అక్కడ యూనివర్సిటీలో 1988లో డాక్టరేట్ డిగ్రీ కూడా తీసుకుంది.

కల్పన చౌలా డాక్టర్ కల్పన చౌలా అవగానే, 1988లోనే నాసాలో రీసెర్చ్ సైంటిస్ట్‌గా ఉద్యోగంలో చేరింది. కల్పనకి సింగిల్ ఇంజన్, మల్టిపుల్ ఇంజన్ విమానాలను నడిపే అనుభవం ఇచ్చినవాడు ఫ్లైట్ ఇంస్ట్రక్టర్ జీన్ పీర్ హారిసన్. ఆమెకి వాటిల్లో కమర్షియల్ పైలట్ లైసెన్స్ కూడా వుంది. తను ఆకాశంలో ఎగరటానికి ఆ లైసెన్స్ రావటంలో సహకరించిన హారిసన్‌ని పెళ్ళిచేసుకుని, అతన్ని ఆకాశంలోకి ఎత్తేసింది కల్పన.

కాకపోతే ఆ మిగిలివున్న కోరిక, అంతరిక్షంలోకి వెళ్ళాలనే చిరకాలపు కోరిక డిశెంబర్ 1994లో ఒక పెద్ద అవకాశం రూపంలో ఆవిడకి వచ్చింది. కొన్ని వేలమంది అప్లై చేసిన ఆ ఇరవై ఉద్యోగాలలోనూ కల్పన కూడా వుంది. ఆ అవకాశం కోసమే జీవితమంతా ఎదురు చూస్తున్న కల్పన, ఇక వెనకడుగు వేయలేదు.

అమెరికన్ సిటిజన్‌గా మారిన కల్పన, మొట్టమొదటగా అంతరిక్షంలోకి వెళ్ళింది 1997లో. కొలంబియా స్పేస్ షటిల్లో కల్పన ఆరున్నర మిలియన్ల మైళ్ళు, 376 గంటల్లో ప్రయాణం చేసింది. అంతరిక్షంలో చేసిన ప్రయోగాలలో కీలకమైన పాత్ర వహించింది. ఆమె ఆ సంవత్సరం ఉమన్ ఆఫ్ ది ఇయర్‌గా గౌరవించబడింది కూడాను.

అదే కొలంబియాలో అంతరిక్షంలో పదహారు రోజుల విజ్ఞాన పండుగ కోసం, ఇంకొక ఆరుగురు అంతరిక్ష నావికులతో మళ్ళీ బయల్దేరింది మిషన్ స్పెషలిస్ట్ కల్పన.

ఫిబ్రవరి ఒకటో తారీకు 2003 సంవత్సరం. శనివారం. ఏవో కొత్త విషయాలు తెలుసుకుందామని ఒక ట్రైనింగ్ ప్రోగ్రాంకి వెళ్ళాను ఆస్టిన్ టెక్సాస్‌లో. పొద్దున్న ఎనిమిదిన్నరకి అక్కడికి వెడితే, అప్పటికే ట్రైనింగ్ రూమ్‌లో నలుగురైదుగురు టీవీ దగ్గర గుమికూడి మౌనంగా, ఆందోళనగా చూస్తున్నారు.

నేను 1986లో చూసినదే మళ్ళీ చూపిస్తున్నారనుకున్నాను.

కాదు. అది ఛాలెంజర్. ఇది కొలంబియా. కల్పన వున్న కొలంబియా.

ట్రైనింగ్ కార్యక్రమం నడుస్తున్నదే కానీ, మధ్యమధ్యలో ఏం జరుగుతున్నదో టీవీలో చూస్తూనే వున్నాం. ఏం జరగకూడదో అదే జరిగింది. మనిషి దీక్షనీ, ఉత్సాహాన్నీ, ఊపిరినీ కొన్ని క్షణాలు ఆపేదే జరిగింది.

అయినా ఈ శాస్త్ర విజ్ఞాన శోధన ఆగేది కాదు. ఆగదు. ఆగకూడదు.

కాకపోతే ఆగింది – ఆ ఏడుగురు శాస్త్రజ్ఞులకి ఇద్దామనుకున్న ఘనమైన స్వాగతం. కల్పనకి ఫిబ్రవరి 17న ఆర్లింగ్‌టన్‌లో యూనివర్సిటీ వాళ్ళు చేద్దామనుకున్న ఘన సన్మానం. కల్పననీ, మిగతా ఆరుగురు అంతరిక్ష శాస్త్రజ్ఞుల్నీ మనసుల్లో దాచుకున్న ఆ హృదయ స్పందన.

* * *